క్లుప్తంగా

జీజీహెచ్‌ని సందర్శించిన అభివృద్ధి కమిటీ సభ్యులు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యులు రామచంద్ర ప్రభు, డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ శనివారం ఆస్పత్రిని సందర్శించారు. హెచ్‌డీఎస్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, వైస్ చైర్మన్ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఆదేశాల మేరకు ఆస్పత్రి వివిధ విభాగాలను పరిశీలించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కలెక్టరేట్‌లో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పేమ్మసాని చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 60 అంశాలపై సమీక్ష చేశారని చెప్పారు. ఆయా అంశాలపై సత్వర అమలుకు తీసుకోవాల్సిన చర్యల గురించి సంబంధిత అధికారులను సంప్రదించాలని కమిటీ సభ్యులు ఆదేశించినట్లు చెప్పారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను ఆక్రమించిన షాపులను నగరపాలక సంస్థ అధికారులు తొలగించడాన్ని సభ్యులు అభినందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తులసి సీడ్స్ ఎండీ యోగేష్ చంద్ర, ఉగ్గిరాల సీతారామయ్య, ఏడీ నాగేశ్వరావు, జీడీ సుధారాణి, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ వెంకట కిరణ్, ఇంజనీరింగ్ అధికారులు రత్తయ్య, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కేఎల్‌పీ స్కూల్లో దసరా సంబరాలు



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో శనివారం ముందస్తు దసరా సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకుంటారని అన్నారు. విద్యార్థినులు నవదుర్గల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఏఓ కె.వెంకట్రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర రాయపాటి శ్రీనివాస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

సీతారామయ్య స్కూల్లో అలరించిన దసరా సంబరాలు



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో శనివారం ముందస్తు దసరా సంబరాలు నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాల కలబోతగా విద్యార్థినులు నవదుర్గల వేషధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడారు. విద్యార్థులు మహిషాసుర సంహారం, సంగీతం, నృత్య రూపక ప్రదర్శన, నవరాత్రులు తొమ్మిది రోజుల అమ్మవారి అవతారాలతో పండుగ వాతావరణాన్ని తలపింపజేశారు. పాఠశాల కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు దుర్గా శ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్ల గ్రామం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు గుంటూరు కేంద్రంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు శనివారం రెండు రోజు ఉత్సాహంగా కొనసాగాయి. గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంతో పాటు శ్రీపాటిబండ్ల సీతారామయ్య స్కూల్ క్రీడా మైదానంలో క్రికెట్, జావిలిన్ త్రో, షటిల్ డబుల్, షాట్‌పుట్, వాకింగ్, రన్నింగ్ వంటి ఈవెంట్స్, గేమ్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా పోటీల విజేతలకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ బహుమతులుఅందజేశారు. శనివారం జరిగిన పోటీల్లో గెలిచిన ఉపాధ్యాయులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, ఏఎన్ కుసుమ కుమారి, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా సింగిల్ లాటరీ..

సింగిల్ నంబర్ లాటరీ మనిషికి ఓ వ్యసనం. ఊబిలో దిగితే బయటపడడం కష్టం. వచ్చేది తక్కువ.. చేతి చమురువదిలించుకునేది ఎక్కువ. అయినా మోజులో పడ్డవారు బయటపడలేరు. నగరం కేంద్రంగా మళ్లీ సింగిల్ నెంబర్ లాటరీ దందా షురూ అయింది.

అంతటా దందా షురూ..
- అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గుతున్న పోలీసులు
- లాటరీ నిర్వాహకులకు సహకరిస్తున్న ఆయా స్టేషన్‌ల సిబ్బంది
- కార్మికులు, కూలీలే అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే టార్గెట్
- మామూళ్ల వ్యవహారంలో మఫ్టీ పార్టీలే కీలకం



పట్నంబజారు: సింగిల్ నంబర్ ఆట పూర్తిగా జోరందుకుంటోంది. గతంలో ఆటను జోరుగా కొనసాగించిన వారే అధికార పార్టీ నేతల ఆదేశాలతో ఆటాడిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిలిచిపోయిన.. ఆయా పోలీసుస్టేషన్‌ల పరిధిలో స్టేషన్ అధికారులు, మఫ్టీ పార్టీల కనుసన్నల్లో సింగిల్ దందా కొనసాగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేరుగా అధికార పార్టీ నేతలే ఫోన్‌లు చేసి మరీ సింగిల్ నబర్ నిర్వాహకులకు జోలికి వెళ్లొద్దని చెబుతున్నట్లు సమాచారం.

సింగిల్‌గా దూసుకెళ్తోంది..

సింగిల్ నంబర్ లాటరీ కూడా గతంలో మాదిరిగా కాకుండా కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో చీటీలు రాసి.. కార్మికుల, కూలీనాలీ చేసుకునే ప్రాంతాల్లో అధికంగా ఆటను నిర్వహించేవారు. ప్రస్తుతం మాత్రం ఆన్‌లైన్‌లో పలు యాప్‌ల ద్వారా సింగిల్ దందా కొనసాగిస్తున్నారు. చీటీలు రాసిన తరువాత.. ఆ నంబర్ తగిలితే.. సాయంత్రానికి ఆ మొత్తాన్ని తిరిగి ఒకటికి ఏడింతలు తిరిగి ఇవ్వడం ఆనవాయితీ. రూ.100 కడితే.. సింగిల్ నంబర్ ఆటలో వచ్చే వారికి రూ.700 వస్తాయి. ఈ ఆశతో కార్మికులు వారు పడ్డ కష్టాన్ని అనేక దఫాలుగా పరీక్షించుకుంటూ.. ఒకటికి నాలుగు నంబర్‌లపై పందేలు కాస్తూనే ఉన్నారు. వాట్సాప్ లింకుల ద్వారా యాప్‌ల నిర్వాహకుల కింద పని చేసే వారికి అసిస్టెంట్‌లకు పంపించి, కార్మికుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

గుంటూరు నగరంలోని కొరిటెపాడు, శారదా కాలనీ, అరండల్‌పేట రైల్వేస్టేషన్, బ్రాడీపేట ప్రధాన ప్రాంతాలు, గుజ్జనగుండ్ల, లాలాపేట, పట్నంబజారు, సుద్దపల్లిడొంక, కృష్ణబాబు కాలనీ, చుట్టుగుంట సెంటర్, కంకరగుంట ఫ్లెఓవర్, పాతగుంటూరు, ఆర్టీసీకాలనీ, నందివెలుగు రోడ్డుతో పాటు తెనాలి, పొన్నూరు, పేరేచర్ల సెంటర్, కొత్తపేట, మణిపురం బ్రిడ్జీ, నాజ్‌సెంటర్, నెహ్రూనగర్, పట్నంబజారు, సంగడిగుంట, ఏలూరు బజారు, నల్లచెరువు అధికంగా సింగిల్ నెంబర్ లాటరీ జరుగుతోందని తెలుస్తోంది.

ఒకసారి లాటరీ కొడితే..



ఈ క్రమంలో లాటరీ టికెట్లులో నంబరు తగులుతుందనే ఆశతో వేలాది రూపాయాలు పెట్టి ఆశావాహులు టికెట్లు కొని మోసపోయిన సందర్భాలు ఎన్నో.. ఉన్నాయి. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో సింగిల్ నంబర్ లాటరీ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని, అందులో పలు ప్రాంతాల నుంచి వచ్చే లింకులు ఆధారంగా ఆటలు ఆడిస్తున్నారు. చక్కా.. మక్కా, బోడోలాండ్, సూపర్ చక్కర్, మట్కా కింగ్, సూపర్ రైడర్, ది ఫాక్స్, క్యాసినో కింగ్, గ్యాంబ్లిగ్ బాబాతో పాటు అనేక రకాల యాప్‌లతో పాటు మరికొన్ని యాప్‌లతో ఆట నిర్వహిస్తున్నారు.

ఎవరి సహకారంతో అంటే....

జిల్లాలోని పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా సింగిల్ నంబర్ దందా నడుస్తున్న క్రమంలో ఆయా స్టేషన్ సిబ్బంది సహకారంతోనే ఆట నడుస్తోందనే విమర్శలున్నాయి. ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని లాలాపేట పీఎస్ పరిధిలో పట్నంబజారు, ఏటుకూరు రోడ్డులో అధికంగా జరుగుతున్నప్పటికీ కనీసం అధికారులు పట్టించుకోకపోవటం గమనార్హం. అరండల్‌పేట ఒక కానిస్టేబుల్, నగరంపాలెం పీఎస్‌లో బదిలీ అయిన సీఐకి మఫ్టీగా వ్యవహరించిన కానిస్టేబుల్ నెలవారీ మామూళ్ల మత్తులో ఆటకు వత్తాసు పలుకుతున్నారని తెలుస్తోంది. అయితే వీరు ఇటీవల కాలంలో ఆయా స్టేషన్‌ల నుంచి బదిలీ అయినప్పటికీ రిలీవ్ కాకుండా అదే స్టేషన్‌లో ఉన్నప్పటికీ కనీసం పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. జిల్లా ఎస్పీ నేరుగా బదిలీ చేసినప్పటికీ స్థాన చలనం లేకుండా అదే స్టేషన్‌లలో తిష్ట వేసుకుని కూర్చున్నారనే విమర్శలున్నాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం



సింగిల్ నంబర్ లాటరీ దందా అంశంలో వస్తున్న ఆరోపణలపై విచారిస్తాం. పూర్తి స్థాయిలో విచారణ చేసిన తరువాత సిబ్బంది ఏదైనా అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా వారిపై యాక్షన్ ఉంటుంది.
– **సతీష్‌కుమార్**, ఎస్పీ, గుంటూరు జిల్లా

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

లక్ష్మీపురం: సెల్‌ఫోన్ చూడొద్దని తండ్రి మందలించడంతో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం గుజ్జనగుండ్ల ప్రాంతంలో చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని తండ్రి శనివారం మధ్యాహ్నం నిత్యం సెల్‌ఫోన్‌లు చూడటం సరికాదని మందలించి వెళ్లిపోయాడు. దీంతో కుమార్తె సెల్‌ఫోన్ చూడవద్దని చెప్పినందుకు ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన చెల్లి ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తలుపులు వేసుకుని ఫ్యానుకు ఉరి వేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసుగా నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

బైక్ చోరీపై నగరంపాలెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలు.. తురకపాలెం రోడ్డు, మణికంఠ నగర్ ప్రాంతానికి చెందిన కొండరాతీ బ్రహ్మం, నగరంపాలెం ఐటీసీ సంస్థలో ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తుంటాడు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం 9 గంటలకు ఆఫీసు ముందు ద్విచక్ర వాహనం పెట్టి తిరిగి రాత్రి 7 గంటలకు వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల వెతుకలాడగా కనిపించక పోవడంతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెయింట్ షాపులో..

హార్డ్‌వేర్ షాపు షెట్టర్ తాళాలు పగలగొట్టి కౌంటర్‌లో ఉన్న రూ.1000 తీసుకెళ్లినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మారుతీనగర్ 3వ లైన్ ప్రాంతానికి చెందిన చిల్లంచర్ల రమణకుమార్ అనే వ్యక్తి గుజ్జనగుండ్ల, పలకలూరు వైపు వెళ్లే దారిలో రామా హార్డ్‌వేర్స్ పెయింట్స్ అండ్ మర్చంట్ అనే దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తుంటాడు. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షెట్టర్ తాళాలు పగలగొట్టి కౌంటర్‌లో ఉన్న డబ్బులు తీసుకెళ్లాడు. ఉదయం వచ్చి షాపు వద్దకు వచ్చి చూసేసరికి షాపు అంతా చిందర వందరగా ఉంది. కౌంటర్‌లో ఉన్న రూ.వేయి చోరీ అయినట్లు గుర్తించి పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి సన్నిధిలో కామాక్షిదేవి అలంకారం



అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ దేవస్థానంలో అన్నపూర్ణాదేవి..



వికాస్‌నగర్ షిరిడి మందిరంలో అమ్మవారు గాయత్రీదేవిగా..



మల్లారెడ్డినగర్ అయ్యప్ప దేవాలయంలో గాయత్రీదేవిగా..



రవీంద్రనగర్ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా..



కొరిటెపాడు కోదండ రామాలయంలో అమ్మవారు..



సంపత్‌నగర్ శ్రీశృంగేరీ శంకరమఠంలో వృషభ వాహనంపై..



విద్యానగర్‌లో అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకారం

కామాక్షిదేవిగా అమ్మవారు

నగరంపాలెం: నగరంలో దేవీశరన్నవరాత్రులు మూడో రోజుకి చేరాయి. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. పలు దేవస్థానాలు, మండపాల్లో శ్రీఅమ్మవారికి కుంకుమార్చనలు, విశేష హారతులను నిర్వహించారు. పలు అలంకారాల్లో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం పెద్ద పలకలూరు రోడ్, జేకేసీ కాలేజ్ రోడ్, పట్టాభిపురం, విద్యా నగర్ మెయిన్ రోడ్, కేవీపీ కాలనీ రోడ్, నల్లచెరువు రోడ్, జీటీ రోడ్‌లను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని ఆర్ అండ్ బీ, నగరపాలక సంస్థకు చెందిన ప్రతి రోడ్‌లో ఏ విధమైన పాట్ హోల్ ఉండడానికి వీలులేదని, తక్షణం ఏఈల వారీగా తమ పరిధిలోని రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్యాచ్ వర్క్‌లు నాణ్యతతో ఉండాలని లేకుంటే సంబంధిత పర్యవేక్షణ కార్యదర్శులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాట్ హోల్‌కి చేపట్టే ప్యాచ్ వర్క్‌లకు ముందు, తర్వాత ఫొటోలతో ఫైల్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం బ్రాడీపేట 4వ లైన్ రోడ్‌ని పరిశీలించి రెండు రోజుల్లో రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. రోడ్ ఏర్పాటు సమయంలో ఆక్రమణలు ఎక్కడైనా ఉంటే పట్టణ ప్రణాళిక అధికారుల సమన్వయంతో తొలగించాలని ఆదేశించారు. అలాగే డ్రెయిన్లపై స్లాబ్‌లు ఉన్న వాటిని తొలగించి, వ్యర్థాలు తీయడానికి వీలుగా గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. బ్రాడీపేట 14, 19వ అడ్డరోడ్డుల్లో డ్రెయిన్ల ఆక్రమణల వలన వర్షాలు మురుగు పొంగి తమ ఇళ్లల్లోకి వస్తుందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలించి, డ్రెయిన్ల ఆక్రమణదారులకు ముందస్తుగా ఆక్రమణలు తొలగించాలని సమాచారం అందించి, వారు స్పదించకుంటే తొలగించాలన్నారు. పీకలవాగుని వాగులోకి స్థానికంగా ఉన్న మైనర్ డ్రెయిన్లు నేరుగా కలిసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. జోసఫ్ నగర్ చంద్రభానుడి చెరువుని పరిశీలించి, పూర్తి స్థాయిలో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అనంతరం నల్లచెరువు రిజర్వాయర్‌ను పరిశీలించి తాగునీటి దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని, అధికారులు సమర్థంగా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ట్యాంకర్ల వివరాలను రిజిస్టర్‌లో నేరుగా పరిశీలించి, తాగునీటిని ట్యాంకర్ల ద్వారా ప్రైవేట్ అవసరాలకు తరలిస్తున్నారని పలు ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఈలు తమ పరిధిలో తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని, అన్ని ప్రాంతాలకు సమానంగా సరఫరా జరగాలన్నారు. ఈ పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, ఏఈలు సూరిబాబు, శ్రీకాంత్, నాగవేణి, శానిటరీ సూపర్వైజర్ సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డేవిడ్, బాబు, ఏడుకొండలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నియంత్రణపై శిక్షణ తరగతులు

గుంటూరు మెడికల్: జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్‌లకు క్షయ వ్యాధిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి శనివారం తెలిపారు. ప్రజల్లో క్షయ, కుష్ఠు వ్యాధులపై ఉన్న అపోహలను తొలగించి, సకాలంలో వ్యాధి బాధితులను గుర్తించేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



పట్నంబజారు: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. లాలాపేట పోలీసు స్టేషన్ సమీపంలోని తూనుగుంట్ల వారి వీధిలో 35 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నట్లు శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో సమాచారం వచ్చింది. అక్కడి వరకు నడుచుకుంటూ వచ్చిన వ్యక్తి ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి కొట్టుకుని చనిపోవడంతో స్థానికుల సమాచారం మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యుదయ కళాశాలలో దసరా ఉత్సవాలు



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో శనివారం ముందస్తు దసరా సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థినులు నవదుర్గల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం కోలాటాన్ని ప్రదర్శించారు. అమ్మవారి పూజాల కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బీఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ బి.రోహిణిదేవి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌ను పరిశుభ్రంగా ఉంచి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలు ఆక్రమించిన వాటిని నగరపాలక సంస్థ అధికారులు, పోలీసు అధికారులు సమన్వయంతో తొలగించిన అనంతరం ఆ ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ప్రతిరోజు ఆస్పత్రికి ఐదు వేల మంది రోగులు వస్తున్నారని, రోగులు వారి సహాయకుల రక్షణ కల్పించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం తమ బాధ్యత అన్నారు. అందుభాగంగానే ఆక్రమణలు తొలగించినట్లు చెప్పారు. ట్రాఫిక్ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా మారిందని, ఈ వ్యవస్థను పెద్ద ఎత్తున మార్పులు చేసేందుకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఆస్పత్రి బయటనే పార్కింగ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థినులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ పారా లక్ష్మయ్య



మాట్లాడుతున్న లక్ష్మయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక ప్రపంచంలో దేశ జనాభాలో సగం పైగా ఉన్న మహిళలు విద్యావంతులు కావడం ద్వారానే భవిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దవచ్చని లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ పారా లక్ష్మయ్య పేర్కొన్నారు. శనివారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో కొత్తగా డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ 'దీక్షారంభ్–2024' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు తమ బాధ్యతలు గుర్తెరిగి చదవాలన్నారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానంలో డిగ్రీ చివరి సంవత్సరంలోనే ఉద్యోగాలకు అర్హత సాధించేలా పాఠ్యాంశాల్లో మార్పులు ప్రవేశపెట్టారని చెప్పారు. డాక్టర్ శాఖమూరి శ్రీనివాస ప్రసాద్, ధారా మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రమాజ్యోత్స్న కుమారి మాట్లాడారు. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ కె.సుబ్బరత్నమ్మ, అధ్యాపకులు డాక్టర్ పి.విజయలక్ష్మి, డాక్టర్ జి.అపర్ణ సీతారామ్, గంటా శ్రీనివాసరావు, పి.ప్రణయ, డి.విజయశ్రీ, డి.ఉమా పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో అంతర్గత బదిలీలు

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మినిస్ట్రీరియల్ ఎంప్లాయీస్ అంతర్గత బదిలీ చేస్తూ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఏళ్ల తరబడి ఒకే సీటులో పని చేస్తూ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందికి స్థాన చలనం కల్పించారు.





మర్యాద పూర్వక కలయిక....



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడిగా నియమితులైన వనమా బాలవజ్రబాబు(డైమండ్ బాబు) శనివారం పార్టీ ముఖ్య నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థనగర్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, రెడ్డిపాలెంలోని నివాసంలో గుంటూరు, నరసరరావుపేట పార్లమెంట్ జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, విద్యానగర్‌లోని ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, శ్యామలానగర్‌లో మాజీ మంత్రి, పార్టీ పశ్చిమ నియోకవర్గ సమన్వయకర్త విడదల రజినిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

